నట్టల నివారణ.. జీవాలకు రక్షణ

- 30వరకు టీకాలు పంపిణీ
- పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి
- పశుసంవర్ధక శాఖ అధికారులు



జీవాలకు నట్టల నివారణ టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

నరసరావుపేట రూరల్: నట్టల నివారణ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈనెల 16 ప్రారంభమైన ఈ కార్యక్రమం 30వ తేదీ వరకు కొనసాగనుంది. అంతర్ పరాన్న జీవులైన ఏలికపాములు, జలగలు, బద్దె పురుగులు కడుపులో చేరడం వల్ల గొర్రెలు, మేకలు మృత్యువాత పడే అవకాశం ఉంది. సకాలంలో నట్టల నివారణ మందు(డీవార్మింగ్) ఇవ్వడం ద్వారా దీనిని నివారించవచ్చు. నియోజకవర్గంలో 45వేల గొర్రెలు, మేకలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లోని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌లు గొర్రెలకు, మేకలకు టీకాలు అందించే విధంగా శాఖాపరమైన ఏర్పాట్లు చేశారు. పశుపోషకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచించారు.

వ్యాధి లక్షణాలు..

భూమికి దగ్గరగా ఉన్న గడ్డిని తినడం వలన గొర్రెలలో ఉండే అంతరపరాన్న జీవుల గుడ్లు పేడ ద్వారా నేలపై చేరి లార్వాలాగా అభివృద్ధి చెంది గడ్డిపై చేరి ఉంటాయి. ఈ గడ్డిని గొర్రెలు, మేకలు తిన్నప్పుడు తిరిగి శరీరంలో ప్రవేశిస్తాయి. పేడను ముద్దగా వేయడం, విరేచనాలు చేసినప్పుడు అందులో బద్దె పురుగులు కనిపిస్తాయి. శరీరానికి అందే పోషక పదార్థాలను నట్టలు ఉపయోగించుకోవడం వలన గొర్రెలు బలహీనంగా ఉంటాయి. కొన్ని రకాల అంతరపరాన్ని జీవులు శరీరం నుంచి రక్తాన్ని పీల్చుకోవడం వల్ల రక్తహీనత కలిగి కళ్లు తెల్లగా పాలిపోయి ఉంటాయి. జలగలు కాలేయంలో ఉండటం వలన ఈ భాగం దెబ్బతింటుంది. దీంతో గడ్డం కింద నీరు చేరి వాపు వస్తుంది. ఈ వాపు సాయంత్రం వేళల్లో మాత్రమే కనిపిస్తుంది. జీవాలు బలహీనంగా ఉండటం వలన రోగనిరోధక శక్తి తగ్గిపోవడంతో న్యూమోనియా లాంటి ఇతర వ్యాధులు కూడా వ్యాపిస్తాయి.

నివారణ మార్గాలు..

జీవాలలో లక్షణాలు గుర్తిస్తే పేడను పరీక్ష చేయించి పశువైద్యాధికారి సిఫారసు చేసిన మందులను వాడాలి. చనిపోయిన గొర్రెలకు పరీక్ష చేయించి ఏదైనా వ్యాధి ఉన్నట్టు నిర్ధారిస్తే మిగిలిన మందకు వ్యాప్తిచెందకుండా చర్యలు తీసుకోవాలి. ఏడాదికి కనీసం నాలుగుసార్లు నట్టల నివారణ మందులు తాపించాలి. పశువైద్యాధికారి సూచనల మేరకు ఏలికపాములు ఉన్నట్టయితే అల్బెండజోల్, ఫెన్‌బెండజోల్ తాపించాలి. జలగలు ఉన్నట్టయితే ఆక్సిక్లోజనైడ్, రఫాక్సినైడ్, క్లోజంటాల్ వాడాలి. బద్దె పరుగులు ఉన్నట్టయితే నిక్లోజమైడ్ లాంటి మందులు తాపించాలి.

నివారణ మందు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు

జీవాల వయస్సు బరువును బట్టి సరైన మోతాదులో మందు ఇవ్వాలి. తక్కువగా ఇస్తే పని చేయదు. ఎక్కువ మోతాదులో ఇవ్వడం వలన గర్భంతో ఉన్న జీవాలకు అబార్షన్ ఆయ్యే అవకాశం ఉంటుంది. నట్టల మందు తాపించే ముందురోజు తక్కువ మేత ఇవ్వాలి. ఉదయాన్నే జీవాలకు మేతకు తీసుకుపోయే ముందే మందు తాపించాలి. ముందును నాలుకపై నుంచి తాపిస్తే బాగా పనిచేస్తుంది. నట్టల మందును తాపించిన తరువాత తిరిగి అదే ప్రదేశంలో మేతకు జీవాలను తీసుకువెళ్ల కూడదు. మందు తాపించిన తరువాత నెలరోజుల వరకు ఇతర ప్రదేశాల్లోని పచ్చిక బయళ్లలో మేపాలి. పచ్చిక బయళ్లలో మంచు కురిసే సమయంలో లార్వాలు పైకి వచ్చే అవకాశం ఉన్నందున ఆ సమయంలో మేపకూడదు. సూర్యరశ్మి బాగా ప్రసరించే సమయంలో ఈ లార్వాలు గడ్డి మొదళ్లలోకి వెళ్తాయి. ఆ సమయంలో జీవాలను మేతకు తీసుకువెళ్లాలి.

నియోజకవర్గంలో జీవాల వివరాలు

మండలం	గొర్రెలు	మేకలు
నరసరావుపేట	26740	4591
రొంపిచర్ల	12089	1741
మొత్తం సంఖ్య	38829	6332

టీకాలు సద్వినియోగం చేసుకోండి



గొర్రెలు, మేకలలో నట్టల నివారణ కోసం ప్రభుత్వం చేపట్టిన నట్టల నివారణ టీకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి. నట్టల వ్యాధి వల్ల గొర్రెలు, మేకలు మృత్యువాత పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. సొంత వైద్యం మాని, పశువైద్యాధికారులు సలహాలు, సూచనలు పాటించాలి. టీకాలు వేయించడం వలన జీవాలు ఆరోగ్యంగా ఉంటాయి. తద్వారా పెంపకదారులకు మంచి లాభాలు వస్తాయి.

–కె.రామచంద్రరావు,
ఏడీ, పశుసంవర్ధక శాఖ

కలెక్టర్‌కు విరాళం అందజేత



నరసరావుపేట: లింగంగుంట్ల శంకరభారతీపురం హైస్కూలుకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.42 వేలు డిమాండ్ డ్రాఫ్టును గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్ బాబుకు అందజేశారు. వీరిని కలెక్టర్ ప్రశంసించారు. స్కౌట్ మాస్టర్ పమ్మి వెంకటరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ షేక్ షాలేమాతో పాటు వీరందరూ తాము నివాసం ఉండే ప్రాంతాల నుంచి విరాళాలు సేకరించారని ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై ఎమ్మెల్యే అసంతృప్తి



నరసరావుపేట: పట్టణంలో నిర్వహిస్తున్న చెత్తసేకరణపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం రావిపాడు రోడ్డుతో పాటు పట్టణంలో పలు ప్రాంతాల వీధులన్నింటిలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. కాకతీయ నగర్‌లో మురుగునీటి కాలువలను పరిశీలించారు. అరండల్‌పేట ఎల్ఎన్ థియేటర్‌తో పాటు, వివిధ కూడళ్లలో చెత్త పేరుకు పోవడాన్ని పారిశుద్ధ్య కాంట్రాక్టర్, అధికారులను ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బంది తమ పనితీరును మార్చుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య, అమినిటీస్ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోండి

బొల్లాపల్లి: ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడ్ కాలువలకు విడుదలైన నిధులను సద్వినియోగపరచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా వడ్డెంగుంట, కనుమలచెరువు గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పశుపోషణకు ఉపయోగపడే షెడ్‌లు, సీసీ రోడ్లు, సైడ్ కాలువలకు గ్రామాభివృద్ధిలో నిధులు మంజూరయ్యాయని అన్నారు. ఒక్కొక్క గ్రామానికి రూ.10 లక్షల వంతున ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. గ్రామసభల్లో ఏపీవో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల నిలుపుదల

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామం సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ కాలువ కట్ట నుంచి నీరు లీకేజీ అవుతుండటంతో సాగర్ జలాలు విడుదల నిలుపుదల చేశారు. అయితే నీటి నిలుపుదలతో వరి పంట సాగు చేసిన రైతుల్లో ఆందోళన మొదలైంది. మండలంలోని వెలమవారిపాలెం గ్రామ ప్రధాన కాల్వ కట్ట అన్నవరప్పాడు మేజరుకు నీరు వెళ్లే ప్రదేశంలో ప్రధాన కాల్వ కట్ట దెబ్బతినడంతో విషయం గ్రహించిన ఎన్నెస్పీ అధికారులు సాగర్ జలాలు విడుదల నిలుపుదల చేశారు. ఈ విషయమై ఎన్నెస్పీ ఏఈ పోట్లూరు లక్ష్మీనారాయణను వివరణ కోరగా వెలమవారిపాలెం గ్రామ సమీపంలో అన్నవరప్పాడు మేజరుకు నీరు విడుదలయ్యే ప్రదేశంలో ప్రధాన కాల్వ కట్ట నుంచి నీరు లీకేజీ అవుతుండగా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఏబీసీ కెనాల్‌కు నీరు విడుదల నిలుపుదల చేశామన్నారు. తక్షణమే మరమ్మతులు చేయించామని శుక్రవారం సాయంత్రం నాటికి సాగునీరు విడుదలయ్యే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

కామ్రేడ్ ఓంకార్‌కు ఘన నివాళి



నరసరావుపేట: ఎంసీపీఐయు పార్టీ వ్యవస్థాపకులు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతిని పట్టణంలోని కమ్మరి సంఘ నాయకులు కాన్రాతి సాంబయ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్‌బాష పాల్గొని ఓంకార్ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 ఏళ్ల అతి చిన్న వయసులోనే చదువుకుంటూ వామపక్ష రాజకీయాలకు ఆకర్షితుడై ఆంధ్ర మహాసభలో చేరి సాయుధ శిక్షణను నేర్చుకొని నైజాం సంస్థానం, దొరల గడీలకు వ్యతిరేకంగా తుపాకీతో పోరాడన్నారు. ఐదుసార్లు శాసనసభ్యుడుగా ఎన్నికై అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలు కాకుండా సమస్యల మీదే మాట్లాడి పరిష్కారమయ్యే వరకు పట్టుదలతో పోరాడే వారిని కొనియాడారు. వారి స్ఫూర్తితో అందరూ కమ్యూనిస్టు పార్టీలో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి

వినుకొండ(నూజెండ్ల): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ 2025 మార్చిలో జరిగే ఎన్నికల్లో భాగంగా పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి లగడపాటి వేణుగోపాల్ తెలిపారు. పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నవంబరు 6వ తేదీ లోపు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో షేక్ ఫిరోజ్, కామా వెంకటేశ్వర్లు, ఎస్.ప్రసాద్, ఎం.ప్రసాద్, కేవీఆర్ మోహన్‌చంద్, పాల్గొన్నారు.

రుణాల రికవరీ తప్పనిసరి

బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వెలుగు పథకం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా స్త్రీనిధి ఏజీఎం ఆర్.చిన్నబుల్లెయ్య మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు నూటికి నూరు శాతం రికవరీ చేయాలన్నారు. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించిన సంఘాలకు తిరిగి రుణాలు అందజేస్తామన్నారు. మండలంలో స్త్రీనిధి రుణాలు రూ.43.70 లక్షల బకాయిలు పేరుకుపోయాయని, తప్పనిసరిగా రికవరీ చేయాలని అన్నారు. స్త్రీనిధి బకాయిలపై రికవరీ గురించి సిబ్బంది దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రంగారెడ్డి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం అభినందనీయం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన కుమ్మరిపల్లి రామయ్య గురువారం మృతి చెందారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులు అనుమతితో మృతుడు రెండు నేత్రాలు దానం చేయటానికి అంగీకారం తెలిపారు. మృతుడు రెండు కళ్లు పెదకాకాని శంకర కంటి వైద్యశాల దానం చేసినట్లు అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కోఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావు తెలిపారు. ఎవరైనా మరణించిన శరీరాన్ని ఐస్ బాక్సులో 8 గంటల సమయం వరకు ఉంచితే నేత్రాల దానం ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వీరబ్రహ్మం, ప్రసన్న, గాయత్రి, రాజరాజేశ్వరి, లోహిత్‌కుమార్ పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షికి మహానివాళి

వేర్వేరు ప్రాంతాల్లో ఘననివాళి

చిలకలూరిపేట: అందరికీ జ్ఞానాన్ని ప్రసాదించే రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి మహనీయుడని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు కొనియాడారు. మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృత భాషలో ఆయన మొదటి పురాణగాధను రచించారు కాబట్టి ఆదికవి అనే బిరుదు పొందారని తెలిపారు. వాల్మీకి రచించిన రామాయణానికి మతపరమైన ప్రాముఖ్యత మాత్రమే కాదు, జీవితంలో నైతిక, ఆధ్యాత్మిక విలువలు నేర్పే జీవితపాఠంగానూ గుర్తింపు ఉందన్నారు.

అలాంటి గొప్ప గ్రంథాన్ని అందించిన వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, మున్సిపల్ మేనేజర్ నగీనా సుల్తానా బేగం, టీపీఎస్ సుజాత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసరావుపేట ఈస్ట్: రామాయణం మహాకావ్యాన్ని అందించిన మహనీయులు వాల్మీకి మహర్షి అని శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి తెలిపారు. పల్నాడురోడ్డులోని శాఖ గ్రంథాలయంలో గురువారం శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామాయణ మహాకావ్యం ఆదర్శ జీవనాన్ని లోకానికి అందించిందని చినరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ, రెడ్‌క్రాస్ సభ్యుడు బి.మురళీధరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతీయ సాహిత్యం, సంస్కృతికి ఆది కవి చేసిన సేవలను గుర్తు చేశారు. వాల్మీకి రామాయణంలోని తార్కికభావాన్ని ఆహుతులకు వివరించారు. వాల్మీకి సిద్ధాంతం, అతని ఇతిహాస కావ్యమైన రామాణంలో ప్రతిబింబిస్తుందన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో...

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ సురేష్ నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వాల్మీకి వేటగాడు నుంచి రుషిగా మారడం ద్వారా అన్ని జీవుల పట్ల కనికరం కలిగి ఉండటాన్ని వాల్మీకి వ్యక్తిగత జీవిత సాంఘికీకరణ పరిణామాన్ని ఉదహరించారు. వాల్మీకి రామాయణం భారతీయ ఆలోచన సంస్కృతిపై శాశ్వత ముద్రను ఏర్పరిచారన్నారు.



వినుకొండలో వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కమిషనర్ సుభాష్ చంద్రబోస్



వినుకొండలో వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్ సురేష్ నాయక్



నరసరావుపేటలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

చిన్నారుల కంటిచూపుపై శ్రద్ధ చూపాలి

కంటి వైద్య నిపుణులు డాక్టర్ చెంచురెడ్డి

నరసరావుపేట ఈస్ట్: చిన్నారుల కంటిచూపు పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మాక్స్‌విజన్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ చెంచురెడ్డి తెలిపారు. మాక్స్‌విజన్ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం కే-రిడ్జ్ స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ చెంచురెడ్డి మాట్లాడుతూ, సెల్‌ఫోన్, టి.విలను ఎక్కువగా చూడటంతో పాటు వాటి నుంచి వచ్చే రేడియేషన్ కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. చిన్నారులు తరచూ తలనొప్పికి గురికావటం, కనుల వెంట నీరు కారటం వంటి పరిస్థితులను గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరంలో విద్యార్థులను పరీక్షించి తగిన వైద్య సలహాలు అందించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ జి.బర్నబాస్, అకడమిక్ కోఆర్డినేటర్ హేమంత్, ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రహదారి నిబంధనలు పాటించాల్సిందే

- లేకుంటే చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- చిలకలూరిపేట పరిసరాల్లో పర్యటన

చిలకలూరిపేటటౌన్: జాతీయ, రాష్ట్రీయ రహదారుల బ్లాక్‌స్పాట్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుతో రోడ్డు ప్రమాదాలకు చెక్ చెప్పవచ్చని ఎస్పీ కంచి శ్రీనివాస రావు చెప్పారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే పలు రహదారులను స్థానిక పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే పట్టణంలోని ఏఎంజీ చెక్‌పోస్టు, ఆర్టీసీ బస్టాండ్, నరసరావుపేట సెంటర్, అడ్డరోడ్డు సెంటర్, రూరల్ మండలంలోని పసుమర్రు, బొప్పూడి, కొండ్రుపాడు, కావూరు, లింగంగుంట్ల గ్రామాల పరిధిలోని రహదారులను క్షేత్రస్థాయి పరిశీలన చేసి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. రోడ్డు భద్రతా నియమాలు వాహనదారులు విధిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు పాటించండి- ప్రమాదాలు నివారించండి అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమాన్ని జిల్లాలోని అధికారులు, అలాగే వాహనదారులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. పట్టణ శివారుల్లో అతి వేగంగా వాహనాలు నడపకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. ఎస్పీ వెంట నరసరావుపేట డీఎస్పీ వై.నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐ బండారు సురేష్ బాబు, చిలకలూరిపేట అర్బన్, రూరల్ సీఐలు పి.రమేష్‌బాబు, బి.సుబ్బానాయుడు, రూరల్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్ ఉన్నారు.



చిలకలూరిపేట -నరసరావుపేట మార్గంలోని కొండ్రుపాడు వద్ద సూచనలు చేస్తున్న ఎస్పీ

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

ఆర్డీవో మధులత

ఈపూరు: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి మధులత వెల్లడించారు. గురువారం ఆమె స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వీఆర్వోలతో, గ్రామసర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. మ్యూటేషన్ విషయంలో ఆలస్యం జరగకుండా చూడాలని, ఏమైనా పెండింగ్ ఉన్నట్లయితే సంబంధిత అర్జీదారులకు తెలియజేసి దాన్ని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నళిని పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి నవంబర్ 1వ తేదీ వరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.నిర్మల గురువారం తెలిపారు. 18వ తేదీన ముత్తనపల్లి గ్రామంలో, 19న అన్నవరప్పాడు, 22న ఆరేపల్లి, 23న అలవాల, 24న నల్లగార్లపాడు, 25న దాసరిపాలెం, 26న మాచవరం, 28న సంతగుడిపాడు, 29న తురిమెళ్ల, 30న అన్నవరం, నవంబర్ 1వ తేదీన రొంపిచర్ల గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు తెలి పారు.

శావల్యాపురం: నేటి నుంచి ఈనెల 24 వరకు రీసర్వే చేసిన గ్రామపంచాయతీల్లో రెవెన్యూ అధికారులు సారథ్యంలో గ్రామసభలు నిర్వహించుతున్నట్లు తహసీల్దారు వేముల వెంకట నాగరాజు గురువారం తెలిపారు.

వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వినుకొండ మండలంలో ఈ నెల 18 నుంచి నవంబరు 7 వరకు రీ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్‌నాయక్ తెలిపారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో పట్టాదారుల నుండి రీసర్వేకు సంబంధించి అడంగల్‌లో మార్పులు, చేర్పులు మరియు సర్వే సంబంధిత అర్జీలు, పట్టాదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో మధులత



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నేటి నుండి రెవెన్యూ సదస్సులు

నాదెండ్ల: ఈ నెల 18-29 వరకూ గ్రామాల్లో జరిగే రెవిన్యూ సదస్సులపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో షెడ్యూలు విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ ఆయా గ్రామాల సచివాలయ వద్ద జరిగే రెవెన్యూ సదస్సుల్లో రైతులు అర్జీల రూపంలో తమ సమస్యలను వివరించి పరిష్కరించుకోవచ్చన్నారు. 18న సాతులూరు, 19న చందవరం, 22న చిరుమామిళ్ళ, 23న సంకురాత్రిపాడు, 24న గొరిజవోలు, 25న తూబాడు, 26న కనపర్రు, 28న ఇర్లపాడు, 29న గణపవరంలో సదస్సులు జరగనున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు.

ఎండుగుంపాలెంలో పల్లెపండుగ


నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెం గ్రామంలో పంచాయతీరాజ్ వారోత్సవాల్లో భాగంగా గురువారం పల్లె పండుగ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరై పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.55 లక్షల వ్యయంతో ఎండుగుంపాలెం నుంచి అప్పాపురం వరకూ వెళ్లే డొంక రోడ్డు పునరుద్ధరణ పనులు ప్రారంభించారు.

మెరుగైన వైద్యసేవలు అందాలి



శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు పారదర్శకంగా అందించాలని డీఎంహెచ్‌వో బి.రవి అన్నారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రవి మాట్లాడుతూ గర్భిణులు నమోదు పురోగతి వేగవంతమయ్యేలా వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. మండల ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మాణ్యం రాధాకృష్ణన్, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్స్ సతీష్ పాల్గొన్నారు.

జాన్‌డేవిడ్ సేవలు ఆదర్శనీయం



చిలకలూరిపేట: డాక్టర్ జాన్‌డేవిడ్ సేవలు ఆదర్శనీయమైనవని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, ఫార్‌కార్నర్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జెస్సీ ఎస్ బర్నబాస్ చెప్పారు. ఏఎంజీ, ఫార్‌కార్నర్స్, వేద స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ జాన్‌డేవిడ్ జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఆయా సంస్థలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు జాన్‌డేవిడ్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న జాన్‌డేవిడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేద వర్గాలకు చెందిన పిల్లలు ఉన్నతస్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో విద్యాసంస్థలు స్థాపించి వేలాది మంది విద్యార్థులకు వసతితో కూడిన ఉచిత విద్యను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్ సులక్షన్, సాంబయ్య, మోజెస్, పీటర్, ప్రసన్న, సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నరసరావుపేట రూరల్: ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మద్యానికి బానిసైన మండలంలోని పెదరెడ్డిపాలెంకు చెందిన మార్పుల లక్ష్మయ్య (29) వారం రోజుల క్రితం పురుగుమందు సేవించి ఇంటి వద్ద ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన స్థానికులు అతడిని పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ కిషోర్ తెలిపారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలి

నరసరావుపేట: పట్టణంలోని హార్డ్ జూనియర్ కాలేజ్ కాంపౌండ్ 12 ఎకరాలు, ఏబీఎస్ వెస్ట్ కాంపౌండ్ 3.75 ఎకరాల ఆస్తిని కొంతమంది వ్యక్తులు అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకొని చేస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలని ప్రాపర్టీ కస్టోడియల్ కనుమూరు జయరాజ్ కోరారు. ఈ మేరకు గురువారం బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావుతో కలసి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి విన్నవించారు.